డ్రైవరు గార్డుకూడా ఏక కంఠతో ఆ బండిలో వాళ్ళందరకూ వార్నింగు ఇస్తూ వెళ్ళిపోయారు.

సుఫాలరావు భార్య ఊరికే ఇదైయింది మగడు సిగరెట్టు కాలుస్తూ తల్లిని కూడా మఱచినాడని !

అయితే సిగరెట్ ! సిగరెట్ ! అది లోకమంతటా అందులోను మగవాళ్ళకు విశేషంగా ఏలా అలవాటు అయిందో అని ఆశ్చర్యమే !

.... .... .... .... ....

## వంతెనమతం

వంతెన ఆవల క్రిష్టియన్ పేట. అక్కడక్కడ కుటీరాలు కొబ్బరిచెట్లల్లో కులాయాల్లాగుండి చిన్న చిన్న దారులు కలిగి, కలిసి, మెలసి వుండే కొద్దిపాటి జనంతో విరాజిల్లుతూ వున్న పేట అది. ఆ వంతెనదాటి అడుగుపెడితిమా ఆ పేట అంత అతి నిర్మలమైనది నీడయిచ్చేది మఱొకటి కానం. ఎండప్పుడే కాకుండా, వెన్నెలప్పుడుకూడా ఆ పేటలో కాపురంవున్నవాళ్ళు నీడనే ఆపేక్షిస్తారు. ఎంచేతా అంటే, నీడఅన్నది ఆ తావున అంత అందంగా వుంటుంది కాబట్టి. మఱిన్నీ ఆ నీడ ఆకాశం నుంచి పడే వెలుగుజాడల్తో ఆ వూరు మనిషిలో అదోవింత, వివేకము, వినోదమూ కూడా కలిగిస్తూవుంటుంది కాబట్టి.

వంతెన దాటకుండావుంటే అంతా దుమ్ముమయమైన రోడ్డు. రోడ్డుప్రక్కనే మహాపట్నం. ఆ పట్నాన్ని తలపోస్తిమా హిందూమతసంబంధమైన బాంధవ్యంబంధనం మదికొస్తుంది.

ఈ మహాపట్నంయొక్క జనసంఖ్యలో శతశతాంశమై యుంటారు ఆ క్రిష్టియన్ ప్రజ. చాలాకాలమై వారందరూ క్రిష్టియన్లు అయినారని ప్రతీతి. అడిగితే ఒక్కొక్క ముసిలతను ఆపేటలో కాపురంవుండే అతడు, తన తాతముత్తాతల్లో ఎవరో ఒకరైనా క్రైస్తును చూచివుండాలి అని అంటాడు. కొబ్బరిచెట్లూ ఆలాంటి పూర్వోత్రపు మహిమగల గాలే వీస్తూవుంటాయి కాని అరటిచెట్లు మాత్రం నిరుడో, ముంగటేడో నాటబడి వంతెన కట్టబడ్డ తరువాతను గెలేస్తూవున్న వానిగా తోచేని.

ఆ అరటిచెట్లతోపాటు క్రొంగ్రొత్తదనం నెఱపుతూ ఏటేటా మారుతూ అధునాతనంగా నచ్చే మతగురువు—అతణ్ణే "పాస్టర్" అంటారు ఆ భాషలో — అతగాడొకడున్నాడు. తతిమ్మా ప్రజ ఎంతపాతకాపులం అని చెప్పుకున్నా అతగాడు మాత్రం క్రిస్టియన్ మతమన్నది ఎప్పటికప్పుడు తనద్వారా క్రొత్త ప్రదేశం ఆ ప్రజలకు పంపుతూవుంటుందనక మానడు. ఈ వంతెన ఎల్లా నిర్మాణమైయున్నదో, క్రొత్తగా తమ క్రిష్టియన్ పేట నిమిత్తమై, ఆ ప్రకారం క్రొత్తరక్తం ప్రతీ క్రిష్టియన్ యింటా నాటినుండీ ప్రవహించా లనేనాడు. ఏనాటి కానాడే ఒనక్క !

అయితే ఆ "పాస్టర్" తో వాదించేవాళ్లు లేకపోలేదు. "వంతెన అన్నదానికి ఒకవైపునే క్రిష్టియన్‌పేట అన్నదుంది కాని రెండోవైపు అంతా హిందువుల నగరమేగా! అనివొకరు; మఱిన్ని వంతెన అనేక స్తంభాలమీద నిలిచివున్నదికాని ఒక స్తంభాన్ని ఆనుకుని వున్నదికాదు, ఆలానే పరాత్పరుడు అన్ని మతాలకు సంబంధించి ఒకపెద్ద వంతెనగావుండి మనలను దాటి

స్తున్నాడని మరొకరు, ఇలా ఎవరికి తోచినట్టు వారు ఆ "పాస్టరు"తో వాదించడం కద్దు. "పాస్టర్" కూడా కొన్నాళ్ళకు ఆ ప్రాంతానికి పాతబడిపోయి "వంతెన" ఉపమానం తన ఆలోచన పథంలో మానేసి, దైనందిన వాతావరణంలోంచే ఏవేవో ఉదాహరణమును చెప్పేవాడు. వంతెనమీదున్నంతసేపు మతమన్నదాన్ని మఱచిపోయేవాడు. వంతెన క్రింద ప్రవహించే నీటిని, ఆ వంతెన పొడుగుని, వంతెనక్రింద నుంచి తెరచాపలను దించుకుని తేలిపోయే పడవల్ని. ఇటూఅటూ గట్టునున్న చెట్లను, చెట్లు నీటిలో ప్రతిఫలించే వైఖరిని, సూర్యోదయ సూర్యాస్తమానరాగాన్ని, చంద్రకాంతిని, చుక్కపొడుపుని, ఇలా నిత్యం జరిగే ప్రకృతివ్యాపారాన్ని తిలకించేవాడు. ఎంతసేపు? ఆ వంతెనమీద నిలబడి వున్నంతసేపు. క్రమంగా ఆ వంతెనమీద తాను నిలబడివుండి చూచేవ్యవధిని పొడిగించాడు. గంటనుండి రెండుగంటలదాక కొనసాగించి, క్రమంగా ఝామురుఝామున్నర ఆ వంతెనమీదనే జాగుచేసేవాడు.

ఇలా జాగుచేసినకొద్దీ తాను వచ్చిపోయే జనానికా వంతెన మీద అడ్డమయ్యేవాడు. మొదట్లో కొంతకొంతమంది, తప్పించుకు వెళ్ళేవారు గాని. క్రమంగా కొంద రీసడించుకో ప్రారంభించారు. "ఉన్నది కాస్తవంతెన, దానిమీద నిలబడి విడ్డూరంగా చూడటమేమిటి? ఆ గట్టునో ఈ గట్టునో నిలబడి చూడరాదూ ఆ పాస్టర్" అని ఒకడా యిద్దరా? వేయిమంది అనసాగారు. అప్పుడు పాస్టర్ తాను తప్పుకుంటూ, తప్పుకుంటున్నాగా అనేవాడు అతిశాంతంగా.

ఇలావుంటూవుండగా ఒకసాయంసంధ్యను పచ్చగడ్డిమోపు మోసుకెడుతూ ఆవంతెన ఎక్కలేక ఎక్కి ఒక వృద్ధురాలు,

ఆ నెత్తిమోపును అలాపాస్టరు తగులగా, గంగలోకి విడిచి పెట్టింది, "అదేమిటమ్మ్మ! అలా విడిచిపెట్టేశావు!" అని పాస్టర్ అడిగితే "నీవు పడగొట్టేశావు!" అంది. నిజంగా పాస్టర్‌కు తగిలే ఆ పచ్చగడ్డిమోపు గంగలోపడింది. ఆ ముసిల్దే నిజమాడినదంటే నిజమాడిందని ప్రజ అంతా నివ్వెరపోతూ కనుగోసాగారు. పచ్చగడ్డిమోపు పడీపడటంలో కట్లుతెగి ఏపరక కాపరక విడవడి, నీటిలో తేలిపోసాగాయి. "అయ్యో! వృధాగా పోతూవుందే మోపుమోపూ" అని మఱీ మోహంతో జనం అంతా చూస్తూవుంటే ఒక పెద్ద తెల్లఆవు ఆతట్టుగట్టుదూకి నీటబడి యీ పరకల్ని మేస్తూ కాలవకడ్డుగా రెండోతట్టు గట్టు ఎక్కిపోయింది.

"చూడు! నీ పచ్చగడ్డి ఏటిపాలుకాలే! ఎంచక్కా ఆవు మేసింది!" అన్నాడు ఫాస్టర్. "అలా మేసేఆవులు ఎన్నైనా ఉన్నాయి! నాకు డబ్బులిచ్చే మహారాజుల్లేరు గాని" అంది ముసిల్ది.

"నీకు డబ్బులుకావాలా? మోక్షంకావాలా?" అని ప్రశ్నించాడు పాస్టర్. మహాతాను ఏదిపడితే అది ఒలికించేవాడికి మల్లే. పాస్టర్ ముఖంకేసి వెంటనేచూస్తూ ఆ వృద్ధురాలు "నాకు మోక్షమూవద్దు! డబ్బులూవద్దు! వంతెనమీద దారికావాలి! నా పచ్చగడ్డి మోపు పడిపోకుండా వుంటేశాన!" అంది. "అవును పాపం!" అంటే "అవును పాపం!" అనిఅంతా అన్నారు. పాస్టర్ అప్పుడు గ్రహించాడు. "వంతెన అన్నది ఈ గట్టునుండి ఆ గట్టుకు నడవడానికి గాని మధ్యనిలబడ్డానికి కాదు" అని.

కాని ముసిల్ది మఱి పచ్చగడ్డి మోపెత్తుకొన్నదీ లేదు. ఆ దారిని నడిచిందీలేదు. అనడంమాత్రం ఒకమాట అనేది తనకు

కిరస్తానీ పాస్టర్ వల్ల నాడే కనులపండుగ అయిందని. ఆ మాట పలువురు పలువిధాలుగా అర్థం చేసుకొనేవారు. కొందరేమన్నా ఆమెయొక్క పచ్చగడ్డిమోపును కనుం పండుగకు ఊరికేఏమీ డబ్బులివ్వకుండా తిన్నట్టు పెద్దావునాడే తినేసింది అని. కొందరు నాడే ఆమెకు దేవుడుకనబడి ఆమె నెత్తిమీద పాపాల బరువు రూపంలోనున్న పచ్చగడ్డిమోపును జీవన ప్రవాహంలో పడేసి మాయంచేశాడని. ఇలా ఎవరికితోచిన అర్థంవారు చెప్పి చెప్పి తుదకు దాన్నో క్రొత్తమతంక్రింద జమవేసి ఆ ముసలిదాని మతం "వంతెనమతం" అన్నారు-అందులో అన్ని పండుగలు, అన్ని పరమార్థాలు, ఉన్నాయి అన్నారు. ఆమె మనకంటికి మళ్ళీ కనబడకపోయినా ఆ వంతెన నేటికీ నిలిచివుండి ఆమె అనుభవాన్ని సూచించేని.

.... .... .... .... ....

# ఆర్థిక స్వాతంత్ర్యం

పొలతి పోలమ్మ—దొరపొగాకు దాన్నే కుంఫినీ పొగాకు, దాన్నే బార్న్ పొగాకు, దాన్నే వర్జీనియా పొగాకు అనిన్నీ ఎన్నో పేర్ల ప్రజలు పిలుస్తున్నారు, కొత్త వ్యాపారంగా తెలుగునాట నేడు వ్యాపిస్తూవున్న దనకం చేతను—కాదు మరి! చిన్నపిల్ల వాణ్ణి పద్నాలుగు ముద్దుపేళ్ళ పిలవం? కాసులు అనీ కన్నులు అనీ, గుమ్మడు అనీ, అమ్మదుఅనీ ఆలాగే అదిని—పొలతి పోలమ్మ అని కామాసుకథ ప్రారంభించాను.

పొలతి పోలమ్మ దొరపొగాకు ఫ్యాక్టరీపనిలో కూలీగా కుదిరింది. పసుప్పచ్చని బీరపువ్వురంగున మెఱసిపోతూ వుండె